# అంచనా

- ఎ.ఎం.రావ్

మా దొక మంచి గాంగ్. శర్మ, నేను, నరేష్, రాజు, రమణ, ఆదిత్య. మా బ్రెయిన్ కెమిస్ట్రీ చక్కగా కలిసి ఒక బాచ్‌లాగా మంచిపనైనా, చెడ్డపనైనా చక్కగా చేస్తాం. మాకు మా వూళ్ళో మంచి హోటల్‌కి పోయి వారానికొక సారో, రెండు వారాలకోసారో టిఫిన్‌లు తినడం అంటే మహా సరదా.

మా అందరి ఉద్దేశంలో కొన్ని టిఫిన్‌లు ఇంట్లో చెయ్య కూడదు. చేసినా తినకూడదు. తిన్నా అది కిక్కివ్వదు, మజారాదు. ఈవిషయంలో మా అందరికీ అభిప్రాయ భేదాలు అస్సలులేవు. ఉదాహరణకి మసాలాదోశె, ఇడ్లీ, వడ, రవ్వదోశ. ఇవే ఇంట్లో చేస్తే మసాలాదోశని అట్టు అనవల్సిందే. ఇడ్లీలు మరి చెప్పక్కరలేదు. వాటిని ఇడ్లీ రాళ్ళు అనాలి. వడ సాగుతుంది. రవ్వదోశకి షేపే ఉండదు. వాటితో ఉండే చట్నీ కాంబినేషన్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. అందుకే మా ఫ్రస్ట్రేషన్ పోవాలంటే ఖచ్చితంగా హోటల్‌కి వెళ్ళాల్సిందే అనుకుంటాం. ఇలాగే ఓరోజు 'రాజాకేఫ్'కి వెళ్ళాం మేమంతా. మా రెగ్యులర్ మూల జాగా మాకు దొరికింది. రెండు టేబుళ్ళు జాయిన్‌చేసి సుఖాశీనుల మయ్యాం. ఎప్పటిలాగే ఆవారంలో ఎవరింట్లో ఏ టిఫిన్ ఎంత ఘోరంగా తయ్యారయి ఎవరెవరి మూడ్స్ ఎలా పాడెయ్యాయో అని చర్చ మొదలెట్టారు. కానీ మా నరేష్ మంచి అబ్జర్వేషన్ వున్నవాడు. బాగా మాట్లాడతాడు. లాపాయింట్స్ బాగా లాగుతాడు అన్నిట్లో. కానీ ఆవేళ వాడు మాట్లాడకుండా అవతలి మూల వున్న ఒక మనిషిని చూస్తున్నాడు.

''ఏంరా! ఏమయింది'' అని రాజు వాణ్ణి కెలికేసరికి అవతల మూలవున్న ఆయన తినడం చూడమన్నాడు. అందరం అటుచూశాం. మనిషి చూస్తే చాలా భారీగా ఓ వంద కేజీలుంటాడు. టేబుల్‌కి సోఫాకి మధ్యలో టైట్‌గా ఇరుక్కున్నాడు. ఇంతలో మా దోశలు వచ్చాయి. మరి అతన్ని చూడడం మానేసి మా దీక్షలోకి వెళ్ళి పోయాం. తిన్నాక ఇంకో రౌండ్‌లో రవ్వదోశ తినాలి అని ప్లాన్. కానీ మళ్ళీ మా నరేష్ దృష్టి ఆ భారీ పెర్సనాలిటీ మీదకి పోయినట్లుంది.

వాడు ఆ భీమ్ భాయ్ వైపు చూస్తూ ''అసలు ఫుడ్ ఎంజాయ్ చెయ్యడం అంటే అలా వుండాలిరా. మనమూ వున్నాం, ఎందుకూ?'' అన్నాడు సర్వర్ ఆయనకి తెచ్చిన పెసరట్టు ఉప్మా ప్లేటువైపు చూస్తూ.

''ఏడిశావులే అలాంటి తిండి ఇంటికీ ఒంటికీ ప్రమాదమే'' అన్నాడు రమణ.

''తప్పురా అలా ఒకళ్ళు తింటుంటే కామెంట్ చేయకూడదు. ఎవరి కెపాసిటీకి తగ్గ తిండి వాళ్ళు తింటారు'' అన్నాడు ఆదిత్య.

''సర్లే మనకి తింటే ఆయాసం తినకపోతే నీరసం'' అన్నాడు నరేష్. మసాలా దోశలయి ఇక తెచ్చిన రవ్వదోశల మీదకి పోయాం అంతా. కానీ మా నరేష్ మాత్రం ఆ భారీ మనిషికి అంకితం అయిపోయి, ''అసలు ఆ తిండేంటిరా ఆయనిది? ఆయనలాంటివాళ్ళు రోజుకి ఇద్దరొస్తే చాలు ఈ హోటల్‌వాళ్ళు ఊళ్ళో ఇంకో నాలుగు బ్రాంచిలు ఓపెన్ చేసేస్తారు త్వరలోనే'' అని ఖచ్చితంగా చెప్పాడు.

ఈలోపున సర్వర్ ఆ ఎలిఫెంటాయనికి బిల్ తెచ్చాడు. సర్వర్ మొహంలో ఇన్ని టిఫిన్లు తెచ్చిన అలసటంతా తీరి టిప్ సుల్తాన్‌లాగా నుంచుని వున్నాడు ఆయన ముందు సోంఫ్ ప్లేటులో బిల్ పెట్టి.

చిన్నగా హడావుడి మొదలైంది. అక్కడ టేబుల్ క్లీనర్ కూడా వచ్చి సర్వర్ ప్రక్కన నించోడంతో. ఆయన మాత్రం ఓ రెండు ఇర్వైనోట్లు పైజేబులోంచి తీసి, రెండో జేబులోంచి ఓ పది నోటు తీసి వేసాడు. కానీ బిల్లు మొత్తం సరిపోయినట్లు లేదు. ఆయన కష్టపడి పై రెండు జేబులు మళ్ళీ తడిమాడు. కానీ ఆ రెండు జేబుల్లో డబ్బులు లేవు. మేం కూడా ఆయనదగ్గర డబ్బు లేకపోతే ఏం చేస్తాడా అని ఆలోచిస్తున్నాం.

''డబ్బులు చూస్కోకుండా హోటల్లోకి వస్తే ఇదే బాధ'' అని మా నరేష్ ఎక్స్‌ప్రెషన్ పెట్టాడు.

''తినకపోతే పోయింది. ఈ అవమానం ప్రమాదం?'' అన్నాడు మా ఆదిత్య.

ఈలోపున ఆయన తన పాంటు కుడిజేబులో అతి కష్టంగా చెయ్యిదూర్చి తడిమి ఓ నాల్గు కోయన్స్ లాగాడు బైటకి. అవి ఆ ప్లేటులో వేశాడు. దాంతో ఆ సర్వరు చాలవన్నట్లు మొహం పెట్టి అతనివేపు ఇలాంటి కష్టమర్‌కి దొరికేనేంటి అన్నట్లు చూస్తున్నాడు.

వాళ్ళ మొహాలు చూస్తే ఆయనమీద, టిఫిన్ ఆర్డరిచ్చినప్పుడున్న గౌరవం ఇప్పుడు మాకులేదు అన్నట్లు పెట్టారు. మంచి టిప్ ఇస్తాడన్న ఆశతో అతనికి ఇచ్చిన ట్రీట్‌మెంట్ అంతా దండగయ్యె. డబ్బు చాలకపోతే అతన్ని ఎవరికి అప్పజెప్పాలి అన్న సందేహం. అసలు డబ్బులేకపోతే ఆ తిండి ఆత్రం ఎందుకు అని అతని పైన చిరాకు వాళ్ళ మొహాల్లో వ్యక్తపరుస్తున్నారు.

ఈలోపున అతను వాళ్ళవైపు చూసి తన పాంటు ఎడమ పాకెటు తడమడం మొదలెట్టాడు. అందులో ఓ రెండు రూపాయలు దొరికినట్లున్నాయి. అవి తీసి ప్లేట్లో వేశాడు. ఇక ఇంతకన్న తనదగ్గర లేవన్న ఎక్స్‌ప్రెషన్ పెట్టి కాస్త కదిలాడు.

మా అందరిలోను రకరకాల ఫన్నీ ఫీలింగ్స్ కలుగుతున్నాయి. ఇప్పుడు డబ్బు లేకపోతే ఏం చేస్తాడు. చేతి ఉంగరం పెడ్తాడా? లేకపోతే వాచ్ ఇస్తాడా! దానికి వాళ్ళు ఒప్పుకుంటారా? అసలు ఒప్పుకొన్నా ఈ అవమాన పరిస్థితి ఎలాగ ఫేస్ చేస్తాడు? మనకే ఇలా అయితే ఎలా ఉండేది? అని అనిపించింది.




''నేనైతే చచ్చినా జేబులో డబ్బు చూడకుండా హోటల్‌కి రాను'' అన్నాను. ''నేనైతే అసలు అంత చూసుకోకుండా తినను'' అన్నాడు ఆదిత్య.

''అయినా అంత తిని అలా వొళ్ళు పెంచితే అసలు బుర్ర పని చెయ్యదు'' అని శర్మ అన్నాడు.

ఆయన మాత్రం ఎలాగో ఇబ్బంది పడి ఆ ఇరుకులోంచి బయటకు జరిగి, అతి కష్టం మీద నుంచున్నాడు. మా అందరిలో నెక్స్ట్ వాట్ అన్న సస్పెన్స్ పెరిగి అతనికి ఏం పనిష్‌మెంట్ ఇస్తారు హోటల్‌వాళ్ళు అని చూస్తున్నాం.

లేచిన మనిషి ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని తన బేక్ పాకెట్‌లోంచి చెయ్యి పట్టినంత వంద రూపాయలకట్ట బైటకి లాగి ఒక నోటు తీసి ప్లేటులో వేసి ఏమీ పట్టనట్టు నడిచి వెళ్ళిపోయాడు వెనక్కి చూడకుండా.

మేమంతా సర్వర్లతోపాటు అచేతనంగా ఉండి పోయాం. అతని గురించి మా అంచనా ఏంటోగాని మా గురించి మా అంచనా చాలా మారింది.

★